# బీఆర్ఎస్ గెలిస్తేనే నిరంతర అభివృద్ధి

## ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

### మర్రిగూడ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం



మర్రిగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ, అక్టోబర్ 19 : బీఆర్ఎస్ గెలిస్తేనే అభివృద్ధి నిరంతర కొనసాగుతుందని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్థానిక విజయ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులు పూర్తయితే రానున్న రోజుల్లో మునుగోడు నియోజకవర్గం కోనసీమలా పచ్చగా కళకళలాడుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సమష్టిగా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. అధికార దాహమే పరమావధిగా ఆలోచిస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీల కుట్రలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేసుకున్నామని మరెన్నో కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. అవన్నీ కొనసాగాలంటే రాష్ట్రంలో మునుగోడులో గులాబీ జెండా ఎగురాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వమే పార్టీకి, రాష్ట్ర ప్రజలకు శ్రీరామరక్ష అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలతో పాటు బీఆర్ఎస్ మేనిఫెస్టోను సైతం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.సకల జన సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను రూపొందించారన్నారు. ఈనెల 26న మునుగోడులో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం అయ్యేలా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ మెండు మోహన్ రెడ్డి,జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతు బంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, సీనియర్ నాయకుడు మునగాల వెంకటేశ్వర్ రావు, దళితబంధు డైరెక్టర్ లపంగి నర్సింహా, సహకార సంఘం చైర్మన్లు పందుల యాదయ్య, బాలం నర్సింహా, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్, సర్పంచు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మోటకొండూర్‌లో ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పైళ్ల ఇందిర, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి

## ఆలేరులో గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిదే గెలుపు

- ఎంపీపీ ఇందిర, జడ్పీటీసీ వెంకట్‌రెడ్డి

మోటకొండూర్, అక్టోబర్ 19 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆలేరులో గెలిచేది బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డినే అని ఎంపీపీ పైళ్ల ఇందిర, జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, నార్మల్ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలంతా ఆదరించాలని కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ఆలేరులో ప్రభుత్వ విప్ గొంగిడి గెలుపు ఖాయమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగ్గిడి బాలయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు బురాన్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, నాయకులు నర్సింహులుయాదవ్, భూమండ్ల బీరయ్య, మల్లేశ్, గంధమల్ల మధు, ప్రశాంత్, ఏలేందర్, పవన్ పాల్గొన్నారు.

## నేడు గీతో హృదయోపన్యాసం గ్రంథం ఆవిష్కరణ

చౌటుప్పల్ రూరల్, అక్టోబర్19 : చౌటుప్పల్‌లోని శివభక్త మార్కండేయ ఆలయంలో శుక్రవారం వశిష్ఠానంద గజం రాములు సంపాదకీయం చేసిన గీతాహృదయోపాన్యాసం గ్రంథం ఆవిష్కరించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గోషిక నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గా శరనవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో గీతా పారాయణం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కోదాడ రూరల్, అక్టోబర్ 19 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీ రాష్ట్రం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామానికి చెందిన చుక్కా వీరమ్మ(50) భర్త వెంకటేశ్వర్లుతో కలిసి కోదాడ మండలంలోని గుడిబండ గ్రామానికి చెందిన బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యారు. తిరిగి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వీరమ్మ అక్కడిక్కక్కడే మృతిచెందగా భర్తకు గాయాలయ్యాయి. మృతురాలి కుమారుడు గోపిచంద్ ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ బి.యాగవేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాప్రతినిధులు

## మునుగోడు ఎంపీడీఓ తీరుపై సభ్యుల నిరసన

- సమావేశం నుంచి వాకౌట్
- కార్యాలయం ఎదుట ఆందోళన

మునుగోడు, అక్టోబర్19 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్యసమావేశం నిరవధకంగా వాయిదా పడింది. సర్వసభ్యసమావేశం ప్రారంభం సమయంలో సర్పంచ్ మిర్యాల వెంకన్న మైక్ ఇవ్వమని కోరారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరం సమన్వయం పాటిస్తూ నిబంధనల మేరకు సమావేశం నిర్వహించుకుందామని అన్నారు. ఈ సందర్భంలో మీరు మైకు ఇవ్వక పోతే మేము(ప్రజాప్రతినిధులం) బయటకు పోతామని సర్పంచ్ అనడంతో ఎంపీడీఓ గోఅవుట్ అని అన్నారు. ఈక్రమంలో జడ్పీటీసీ నారాబోయిన స్వరూపారాణి కలుగజేసుకుని ప్రజాప్రతినిధులను గౌరవించకుండా అసభ్యపదాలను వాడడం ఏంటి అని ప్రశ్నించారు. అవసరమైతే నువ్వు కూడా(జడ్పీటీసీని)వెళ్లిపో అని ఎంపీడీఓ అనడంతో ఒక్కసారిగా సభ సమావేశం ఘర్షణ వాతావరణం నెలకొంది. దాంతో సర్వసభ్య సమావేశాన్ని ప్రజా ప్రతినిధుల వాకౌట్ చేసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. దాంతో ఎంపీపీ కర్నాటి స్వామి యాదవ్ ప్రజా ప్రతినిధులను సముదాయించి సభ్యులను సమావేశ మందిరానికి ఆహ్వానించారు. అయినా ప్రజా ప్రతినిధులు సమావేశ మందిరానికి ఎవరూ రాక పోకడంతో సభా వాయిదా పడింది. వివిధ శాఖలు అధికారులు సభ మందిరం నుంచి వెళ్లిపోయారు. ఎంపీడీఓ తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేస్తామని ప్రజా ప్రతినిధులు హెచ్చరించారు.

## ఘనంగా బతుకమ్మ సంబురాలు

చౌటుప్పల్, అక్టోబర్19 : చౌటుప్పల్ అరబిందో జూనియర్ కళాశాల విద్యార్థులు గురువారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వువ్వులను సేకరించి బతుకమ్మలను పేర్చారు. ఆనంతరం ఆడిపాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వలమల్ల రాజశేఖర్, చిలువేరు దుర్గయ్య, కట్టెల లింగస్వామి, అంజయ్య, రాములు పాల్గొన్నారు.

**మునుగోడులో..**

మునుగోడు,అక్టోబర్19 :మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ ఆవరణలో మహిళ ఉద్యోగులు,అంగన్‌వాడీడీ టీచర్లు రకరకాల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడి పాడారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్,మహిళ ఉద్యోగులు అంగన్ వ్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మునుగోడు : బతుకమ్మ ఆడుతున్న మహిళ ఉద్యోగులు

## గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



నాంపల్లి :న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న డాక్టర్ ఇక్బాల్

నాంపల్లి అక్టోబర్ 19 : మండలంలో గర్భిణులు ప్రభుత్వం అందించిన న్యూట్రిషన్ కిట్లను డాక్టర్ ఇక్బాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గర్భిణులు వైద్యులుసూచనలు సలహాలు పాటించాలన్నారు. కిట్‌లో ఖర్జూర పండ్లు 2 బాక్స్‌లు, 2 మదర్ హార్లిక్స్ పౌడర్ , నెయ్యి డబ్బా, 2 బెల్లం పల్లి పట్టీలు, 3 ఐరన్ టానిక్ సీసాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సుకు మోడల్‌స్కూల్ విద్యార్థులు



చండూరు పీహెచ్‌సీలో శక్షణ పొందుతున్న స్కూల్ విద్యార్థులు

మర్రిగూడ, అక్టోబర్ 19 : మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సులో ఇంటర్మీడియట్ సెకండియర్‌కు చెందిన 6 గురు విద్యార్థినులు భాగంగా చండూరు పీహెచ్‌సీలో శిక్షణ పొందుతున్నారు.ఈ మేరకు గురువారం వైద్యా ధికారుల సమక్షంలో కోర్సులో చేరారు. బాలికల్లో ఉన్న వృత్తి నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి నుంచే వృత్తి విద్యా కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెపారు. 9వ తరగతిలో ఎంపిక చేయబడిన విద్యార్థులకు నాలుగేండ్ల పాటు ఇంటర్‌షిప్ ప్రోగ్రాం కింద ప్రతి ఏడాది 10 రోజుల పాటు చదువులో భాగంగా శిక్షణను అందించ నున్నారు. భవిష్యత్‌లో విద్యార్థులకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు వెల్లడించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శివ స్వరూపారాణి, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఆంజనేయులు, ఒకేషనల్ కోర్సు ట్రైనర్ వసంత పాల్గొన్నారు.

## జెర్సీ మిల్క్ శీతలీకరణ కేంద్రం ఎదుట రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

చౌటుప్పల్,అక్టోబర్ 19 : చౌటుప్పల్ పట్టణంలోని జెర్సీ మిల్క్ శీతలీకరణ కేంద్రం ఎదుట గురువారం వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సెంటర్ మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం రావడంతో రైతులు ఆందోళనకు దిగారు. కొన్నేండ్లుగా ఈ డెయిరీని నమ్మకొని పాలు విక్రయిస్తున్నామని చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, మునుగోడు, గట్టుప్పల్ తదితర ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్య ఇతర రాష్ట్రాల్లో పాలు తక్కువ ధరకు దొరకడంతో ఇక్కడి రైతులకు ఆన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సెంటర్ మూసి వేయాలనే ఆలోచనను మానుకోవాలన్నారు. లేదా కొంత సమయం ఇవ్వాలని ఆ సంస్థ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ప్రతినిధులు తమ ఉన్నత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ఆందోళన సద్దుమణిగింది. ఆందోళనలో రైతులు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, శ్రీధర్, లింగస్వామి, శ్రీశైలం ఉన్నారు.

## ఎన్నికల వేళ గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలి

- సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే

హుజూర్‌నగర్, అక్టోబర్ 19 : ఎన్నికలు సమీస్తున్న వేళ గ్రామాల్లో నిఘాను అప్రమత్తం చేసినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. ఎన్నికల నిర్వహణ బందోబస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం ఆయన హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సర్కిల్ పరిధిలోని హుజూర్‌నగర్, మఠంపల్లి, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లో గల సమసాత్మక గ్రామాల గురించి, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల గురించి సమీక్షించారు. గ్రామాల్లో కట్టుదిట్టమైన నిఘాను ఏర్పాటు చేయాలని సమస్యలను సృష్టించే వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలను సందర్శిస్తూ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఎప్పటి కప్పుడు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఈ నెల 31న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభాస్థలాన్ని పరిశీలించి రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

### పారా మిలిటరీ సిబ్బందికి వసతి పరిశీలన

సూర్యాపేట సిటీ : ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు నిర్వహణకు జిల్లాకు రానున్న పారా మిలటరీ సిబ్బంది కోసం జిల్లా కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వసతి ఏర్పాట్లను ఎస్పీ రాహుల్ హెగ్డె గురువారం పరిశీలించారు. జిల్లాకు రానున్న సిబ్బంది కోసం ఎలాంటి ఇబ్బంది లేకు ండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు.